క్లుప్తంగా

ఓల్డేజీ హోమ్‌లో చీరలు, పండ్లు పంపిణీ

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ మహిళా విభాగం ఆధ్వర్యంలో మే–14 న జరిగే మదర్స్ డే సందర్భంగా నాగోలులోని అక్షయ ఓల్డేజీ హోమ్‌లోని వృద్ధురాళ్లకు ఉచితంగా చీరలు, ఫ్రూట్స్, బిస్కట్స్, పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఓల్డేజీ హోమ్ ఆవరణలో 90 ఏళ్ల రాజమ్మతో కలిసి మొక్కను నాటారు. మహిళలను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, తెలంగాణ మహిళా విభాగం ప్రెసిడెంట్ చందా భాగ్యలక్ష్మి, జనరల్ సెక్రటరీ ఎం.శైలజ, కోశాధికారి భువన, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు గీతా గుప్తా, పబ్బ స్వప్న, జ్యోతి, అన్నపూర్ణ, పి.అనిత, కల్యాణి, నళిని, స్వప్న, వాసవి, శ్రీలత, పద్మ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



స్వరూప పద్మారావుగౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సాహెబ్ నగర్ త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంగరంగ వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్, తీగుళ్ల స్వరూప పద్మారావు గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని నిర్వాహకులు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఈఓ ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ అంజన్‌కుమార్, సభ్యులు శంకర్‌మహారాజ్, తరుణ్‌మహారాజ్, ఉమేష్‌గౌడ్, చంద్రకాంత్‌గౌడ్, శ్రవణ్‌యాదవ్, రాజు, ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సత్యదేవ్ ఎన్‌క్లేవ్ కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని సత్యదేవ్‌ఎన్‌క్లేవ్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు మంగళవారం కార్పొరేటర్‌ను కలిసి వివరించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగయ్య, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్, రాజ్‌కుమార్, కాలనీ ప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, గోపాల్‌రావు, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ. 50 వేల విరాళం



చెక్కును అందజేస్తున్న సుబ్బారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బంజారాహిల్స్‌లోని స్నేహ సేవా సంస్థ తరపున అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆర్‌కేపురం డివిజన్‌లోని అనాథ విద్యార్థి గృహం విద్యార్థులకు జూన్ నెల రేషన్ కోసం రూ. 50 వేల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం రెండు తెలుగు రాష్ట్రాల అనాథ నిరుపేద విద్యార్థులకు భోజన , వసతి, విద్యా సౌకర్యాలు కల్పించి వారి బంగారు భవిష్యత్‌కు కృషి చేస్తున్నదని అభినందించారు. స్నేహ సేవా సంస్థ గత పదేళ్లుగా అనాథ విద్యార్థి గృహానికి నెల రేషన్ సరుకులకు అవసరమైన డబ్బులు సమకూరుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా స్నేహ సేవా సంస్థకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం



పూజల్లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: కొత్తపేట వినాయకనగర్‌లోని బంగారు గవ్వల రేణుక ఎల్లమ్మ ఆలయ 13 వ వార్షిక బ్రహ్మోత్సవ కల్యాణ మహోత్సవం, అమ్మవారి ధ్వజస్తంభ ప్రతిష్టాపన, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి శివలింగం, మహాలక్ష్మి, నందీశ్వరుల ప్రతిష్టా మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కట్ట వెంకటేశం స్వామి ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అదరగొట్టారు..

ఇంటర్‌లో సత్తాచాటిన ప్రభుత్వ కళాశాలల బాలికలు



ఎంఈసీ 962 మార్కులు టాపర్ తలాత్ తబస్సుమ్



ఎంఈసీ- 934 2వ ర్యాంక్ ఫలక్ ఉన్నిస్సా



సీఈసీ-947 టాపర్ ఆఫియా మెహెవిష్



ఎంఈసీ- 475 టాపర్ ఫర్హానాబేగం



సీఈసీ 483 టాపర్ నేహా సుల్తానా

మైనార్టీ గురుకుల విద్యార్థినులు...

మన్సూరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మైనార్టీ గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. మన్సూరాబాద్ గణేష్‌నగర్ కాలనీలోని బార్మాస్ మైనార్టీ గురుకుల కళాశాలలో 80 మంది విద్యార్థులు ఇంటర్ మొదటి, 2వ సంవత్సరంలో పరీక్షలకు హాజరు కాగా, 72 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంఈసీ గ్రూప్‌లో తలాత్ తబస్సుమ్ 962 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ఫలక్ ఉన్నిస్సా 934 మార్కులు సాధించి 2వ ర్యాంక్ సాధించింది. సీఈసీ గ్రూప్‌లో ఆఫియా మెహెవిష్ 947 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. మొదటి సంవత్సరంలో ఎంఈసీలో ఫర్హానాబేగం 500 మార్కులకు 475 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అర్షియా సుల్తానా 444 మార్కులు సాధించి 2వ స్థానంలో ఉన్నారు. సీఈసీలో నేహా సుల్తానా 483 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది ఇన్షా సుల్తానా 481 మార్కులు సాధించి 2వ ర్యాంకు సాధించింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ రాణి అభినందనలు తెలిపారు.

మలక్‌పేట కళాశాల బాలికలు..

సైదాబాద్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మలక్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో పలువురు బాలికలు మంచి మార్కులు సాధించారు. కళాశాలకు చెందిన ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని బి.అనుష వెయ్యికి 981 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అదే విభాగంలో హజీరా 970 మార్కులు, తస్నీం ఫాతీమా 960 మార్కులు సాధించారు. బైపీసీ తెలుగు మీడియం విద్యార్థిని ఎం.శ్రీలత 946 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో జె.సౌజన్య 973, తెలుగు మీడియంలో జె.సంధ్య 725 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ ఇంగ్లిష్ మీడియంలో అర్షియా సుల్తానా 935, తెలుగు మీడియంలో కె.స్వప్న 841 మార్కులు సాధించారు.



బి.అనుష బైపీసీ- 981



అర్షియా సుల్తానా సీఈసీ- 935



కె.శ్రావణి ఎంపీసీ - 463

◆ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గానూ కె.శ్రావణి 463లతో టాపర్‌గా నిలిచింది. బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో 440కు 422 మార్కులతో ఫె.ఈశ, తెలుగు మీడియంలో బి.వరలక్ష్మి 284 మార్కులు సాధించారు. సీఈసీలో 500 మార్కులకు ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని సైదా ఫాతీమా 439, తెలుగు మీడియంలో సుప్రియ 413 మార్కులు సాధించారు. అయితే కళాశాల మొత్తంగా చూస్తే ఈ ఫలితాలు కొంత నిరాశకు గురిచేశాయి. అన్ని బ్రాంచుల్లో కలిపి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మొత్తం 243 మంది విద్యార్థినులకు గానూ నలుగురు పరీక్షలకు హాజరు కాలేదు. పరీక్షలకు హాజరైన 239 మందిలో కేవలం 78 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. పాసైనవారి శాతం 32.63. ద్వితీయ సంవత్సరంలో అన్ని బ్రాంచుల్లో కలిపి 259 మందికి గానూ ఒకరు పరీక్షలకు గైర్హాజర్ కాగా, 258 మందికి గానూ 48.44 శాతంతో 125 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

హయత్‌నగర్ కళాశాలలో...



కళాశాల టాపర్‌గా నిలిచిన సోనీ

హయత్‌నగర్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కళాశాలలో సెకండియర్ బైపీసీ చదువుతున గొడిశాల సోనీ 983 మార్కులతో టాపర్‌గా నిలిచారు. సీఈసీలో ఐనమోని పావని 923 మార్కులు సాధించగా, అదే గ్రూపులో కె. జొనాతన్ 913 మార్కుల సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు.

కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది: జక్కిడి



నాగరాణి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కుటుంబానికి పార్టీ భరోసా ఇస్తూ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని తన కార్యాలయంలో కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్న ఓ కుటుంబానికి రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ పరిహార చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 33 వేల సభ్యత్వాలు చేశామని, సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి మదర్ డెయిరీ కాలనీకి చెందిన తన్నీరు నాగరాణి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని, ఆమె కుటుంబానికి భరోసా ఇస్తూ రూ.2 లక్షల చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గజ్జి భాస్కర్‌యాదవ్, క్లౌం సుజాతారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, క్లౌం నర్సింహ్మారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంఘర్షణ సభకు ఎల్‌బీనగర్ నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నేతలు, కార్యకర్తలు, అభిమానులకు ప్రభాకర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన ఎమ్మెల్యే: రాంరెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉన్న అభిమానంతో సుధీర్‌రెడ్డిని గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చెంత చేరారని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి విమర్శించారు. మంగళవారం చైతన్యపురిలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. సరూర్‌నగర్ స్టేడియం ప్రాంగణంలో జరిగిన ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, మహిళా నాయకులు ఇతర కాంగ్రెస్ అనుబంధ విభాగాలు ప్రియాంక సభ విజయం కోసం శ్రమించారన్నారు. సభ సక్సెస్ జీర్ణించుకోలేక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మీటింగ్ అయిన గంటకే కాంగ్రెస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను తొలగింపజేశారని విమర్శించారు. కొందరు కోవర్టులతో రాజకీయాలు చేసి కాంగ్రెస్ పార్టీని నష్టపర్చాలని చూస్తున్నారని ఆరోపించారు. సొంత రాష్ట్రం వస్తే నియామకాలు సక్రమంగా జరిగి ఉద్యోగాలు కలుగుతాయని స్వరాష్ట్రం కోసం బలిదానం చేసిన శ్రీకాంతా చారి గురించి మాట్లాడే నైతిక హక్కు, అర్హత సుధీర్‌రెడ్డికి గానీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు గానీ లేదని మల్‌రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు శ్రీపాల్ రెడ్డి, కుంట్ల నరసింహయాదవ్, బండ సురేందర్‌రెడ్డి, సుజాతారెడ్డి, రమేష్‌నాయక్, జైపాల్‌రెడ్డి, సరిత, అలివేలు, భాగ్యలక్ష్మి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాకు పన్నాగం: సామ



ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డును పరిశీలిస్తున్న రంగారెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని సాగర్‌రింగ్‌రోడ్డు పక్కన ఉన్న కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములను స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన అనుచరులకు అప్పనంగా కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని రంగారెడ్డి బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. సాగర్ రింగ్ రోడ్డులోని బైరామల్‌గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 24లోని 1573 (13 గుంటలు) గజాల పార్కు స్థలాన్ని సామ రంగారెడ్డి మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, పార్కు స్థలాన్ని , ప్రభుత్వ భూములను జీఓ 58,59 కింద క్రమబద్ధీకరించడానికి అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకొని 1573 గజాల స్థలంలో 500 గజాలు తన అనుచరులకు కేటాయించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఒక ఎకరం ఉండగా ప్రస్తుతం సర్వే చేస్తే 13 గుంటలు మిగిలిందని, ఆ స్థలాన్ని కూడా కాజేయాలని ఎమ్మెల్యే అనుచరులు అధికారులతో చేతులు కలిపి రీ సర్వే పేరుతో 5 గుంటలు కాజేయాలని చూడగా కాలనీవాసులు అడ్డుకున్నారన్నారు. దీంతో ఆ స్థలంలో తాత్కాలికంగా ఆట పరికరాలు ఏర్పాటు చేశారన్నారు. కచ్చితంగా 13 గుంటల ప్రభుత్వ భూమిని పార్కుకు కేటాయించాలని, లేదంటే తాము పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని రంగారెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బెదిరింపులకు కాలనీవాసులు భయపడవద్దని, బీజేపీ వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, విజయశ్రీ, మల్లేశ్‌గౌడ్, సోమిరెడ్డి, జీవంరెడ్డి, శేఖర్‌గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, నవనీత్‌గురు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

చైతన్యపురి: చెట్టుకు ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ ఎ.కృష్ణయ్య కథనం ప్రకారం.. బుధవారం దుర్వాసన వస్తోందని మూసీ సమీపంలో వాకింగ్ చేస్తున్న కొందరు అక్కడి సిబ్బందికి తెలిపారు. పరిసరాల్లో పరిశీలించగా మోహన్‌నగర్ శ్మశానవాటికలో ఓ వ్యక్తి చున్నీతో చెట్టుకు ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్ట్ మార్టంకు తరలించారు. మృతుడి వయసు సుమారు 35–40 మధ్య వయసు ఉంటుందని, ఎవరనేది ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కొడవలితో ముగ్గురిపై దాడి

చాదర్‌ఘాట్: పాతకక్షల నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి కొడవలితో ముగ్గురిపై దాడి చేసిన ఘటన చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఉస్మాన్‌పురాకు చెందిన అర్బజ్ (20)కు అదే ప్రాంతానికి చెందిన నిమ్మకాయల వ్యాపారం నిర్వహిస్తున్న అర్షద్, ముదసిర్, జాఫర్‌ల మధ్య గతంలో వివాదాలు తలెత్తాయి. ఈక్రమంలో మద్యం మత్తులో అర్బజ్ ఆ ముగ్గురిపై దాడి చేసి పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలకు గురైన ముగ్గురినీ చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొంది అర్షద్, ముదసిర్‌లు డిశ్చార్జ్ కాగా, జాఫర్ ఇంకా చికిత్స పొందుతున్నాడు, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నన్ను మన్నించండి...

మెసేజ్ పెట్టి యువకుడి అదృశ్యం



వేముల పవన్ కల్యాణ్ (ఫైల్)

చైతన్యపురి: స్నేహితులతో కలిసి ఉంటున్న ఓ యువకుడు 'నన్ను మన్నించండి' అని ఫోన్ మెసేజ్ పెట్టి అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాలు... ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన వేముల పవన్‌కల్యాణ్ (24) నెల రోజుల క్రితం చైతన్యపురి ఫణిగిరి కాలనీలో ఉంటూ గ్రూప్ పరీక్షకు కోచింగ్ తీసుకునే స్నేహితులు అనిరుధ్, ప్రశాంత్, నవీన్‌ల దగ్గరకు వచ్చాడు. ఆదివారం సాయంత్రం బయటకు వెళ్లిన పవన్ కల్యాణ్ ... నవీన్ అనే స్నేహితుడు సెల్‌ఫోన్‌కు 'నన్ను మన్నించండి..నాబ్యాగ్‌లో ఓ లెటర్ పెట్టాను చదవండి' అనివాయిస్ మెసేజ్ పెట్టాడు. విషయాన్ని మిగతా స్నేహితులకు చెప్పి పవన్ కల్యాణ్‌ను ఫోన్‌లో సంప్రదించాలని చూశారు. కానీ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. అప్పటి నుంచి తిరిగి రాకపోవటంతో అనిరుధ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

సైలెన్సర్లు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తాం: సీఐ

హస్తినాపురం: ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసేసి, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా శబ్దకాలుష్యం చేస్తూ వాహనాలను నడిపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం సీఐ డి.జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు. పోలీసుస్టేషన్ పరిధిలోని కమ్మగూడ గ్రామం రాజారంజిత్ కాలనీలో సోమవారం ద్విచక్ర వాహనానికి సైలెన్సర్ లేకుండా వాహనాన్ని నడిపిస్తున్న దేవులపల్లి కార్తికేయ (20) వాహనాన్ని సీజ్ చేసి, అతడిపై మోటార్ వెహికిల్ యాక్ట్ సెక్షన్ 190(2) కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. వనస్థలిపురం ఠాణా పరిధిలో ఎవరైనా తమ ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తొలగించి జిగ్ జాగ్‌గా వాహనాలను నడుపుతూ ఇతర వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని సీఐ హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమై చర్యలు తీసుకుంటామని , పార్కుల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధం అయినప్పటికీ కొంతమంది మందు తాగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు.

రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే



కాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, అన్ని సమస్యలను పరిష్కరించి ఎల్‌బీనగర్‌ను రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతామని స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ కార్పొరేటర్ క్లౌం నవజీవన్‌రెడ్డితో కలిసి హయత్‌నగర్ డివిజన్‌లో సుమారు రూ. 93 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సత్యనారాయణపురం కాలనీ ముఖ ద్వారాన్ని, కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన ఆయన హైకోర్టు కాలనీలో రూ.12.5 లక్షలతో నిర్మించే ఫెన్సింగ్‌కు, రాఘవేంద్రా కాలనీలో రూ.51 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు, ఓల్డ్ విలేజ్ కురుమ బస్తీలో రూ. 13.5 లక్షల తో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, హెచ్‌పీ గోదాం సమీపంలో రూ. 16 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఉగాది ఎల్లప్ప, నాయకులు బాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్, సత్యనారాయణపురం కాలనీ అధ్యక్షులు బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి తదితరులు

మన్సూరాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. డివిజన్ పరిధి జడ్జెస్ కాలనీ ఫేజ్–1లో రూ.30 లక్షలతో చేపడుతున్న కాలనీ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ స్వప్నతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ నిర్దిష్టమైన ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడేది లేదని అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్, భాస్కర్, యాదయ్య, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

యోగా షెడ్ పరిశీలన

మన్సూరాబాద్ పెద్దచెరువులో నూతనంగా నిర్మిస్తున్న యోగా షెడ్‌ను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిమజ్జన కొలనులో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపజేస్తామన్నారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వినాయక నిమజ్జనాలను, బతుకమ్మల నిమజ్జనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

జైపురికాలనీలో ఆధార్ సెంటర్ ప్రారంభం



జైపురికాలనీలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ

నాగోలు: ఆధార్ సెంటర్ అందరూ ఉపయోగించుకొని తప్పులు ఉంటే సరి చేసుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. మంగళవారం నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ మహిళా భవన్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ, ఆధార్ కోసం ఇతర ప్రాంతాలకు పోవాల్సిన పని లేదని అన్నారు. విద్యార్థులు, చిన్నిపిల్లలకు అందరూ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్‌ఆర్‌శ్రీగాయత్రి హవా



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

చైతన్యపురి: తెలంగాణ రాష్ట్ర ఇంటర్ ఫలితాల్లో ఎస్ ఆర్ శ్రీగాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని డైరెక్టర్ ఎ.సంతోష్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో డి.శ్రీకర్, డి.లావణ్య, డి.నిహారిక, శ్రీవిద్య 467 మార్కులు, బీపీసీ విభాగంలో ఎం .దీక్షిత్(436), జి.రాగిణి (492), సీఈసీ విభాగంలో సైదాముష్ర (489) మార్కులు సాధించారన్నారు. అలాగే ద్వితీయ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం .మహితాదేవి, కె.దీపిక, విజయ్‌రాయ్ 992 మార్కులు, ఎంఈసీ విభాగంలో వై.ప్రేరణ 986 మార్కులు సాధించారన్నారు. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ, సూక్ష్మ ప్రణాళిక వల్ల ఈ విజయం సాధ్యమైందన్నారు. పటిష్టమై అకడమిక్ ప్రణాళిక, విద్యార్థులు, అధ్యాపకుల నిర్విరామ కృషి వల్ల మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీజీఎం బి.భగవాన్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ కె.శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఫలితాల్లో ప్రతిభ చాటిన శ్రీచైతన్యకళాశాల విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: ఇంటర్ ఫలితాల్లో దిల్‌సుఖ్‌నగర్ జోన్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఎంపీసీ జూనియర్ ఇంటర్‌లో పదిమంది 467 మార్కులు సాధించారు. 466 మార్కులు 40 కి పైగా విద్యార్థులు సాధించారని, ఇద్దరు 992 మార్కులు, 10 మంది 990 మార్కులు సాధించారని దిల్‌సుఖ్‌నగర్ జోన్ డీన్స్ ఆదిరెడ్డి, జగదీష్, తిరుమల్‌రావు, సత్యేంద్ర బాబు, మమత తెలిపారు. మంగళవారం ఆర్‌కేపురం శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లడుతూ.. బైపీసీ మొదటి సంవత్సరం విద్యార్థులు ఏడుగురు 437 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 992 మార్కులు ఒక్క విద్యార్థికి రాగా ..ముగ్గురు 990 మార్కులు సాధించారని, వి.ప్రసన్న 989 మార్కులు సాధించిందని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, లెక్చరర్స్ పాల్గొన్నారు.

నకిలీ పత్రాల కేసులో మహిళ అరెస్టు

చంచల్‌గూడ: పాత స్టాంపు పేపర్లతో నకిలీ ఇంటి పత్రాలు సృష్టించిన కేసులో ఒక మహిళను మాదన్నపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కుర్మగూడకు చెందిన బల్దె బాలాజీ (57) బ్యాంక్ ఉద్యోగి. రెండు దశాబ్దాల క్రితం ఖాళీ స్థలం కొనుగోలు చేసి బ్యాంక్ రుణం పొంది ఇంటిని నిర్మించుకున్నాడు. బాలాజీ తమ్ముడు రాము సౌదీలో ఉద్యోగం చేస్తున్నాడు. సొంత అన్న ఇంటికి సంబంధించిన నకిలీ పత్రాలు సృష్టించి భార్య మాధవి పేరున రిజిస్టర్ చేయించాడు. గత నవంబర్ నెలలో బాలాజీ ఇంట్లోని మరో పోర్షన్‌కు విద్యుత్ సిబ్బంది మీటరు పెట్టగా అనుమానం వచ్చి ఆరా తీశాడు. కాగా బాలాజీకి స్థలం విక్రయించిన మహిళ భర్త సంతకాన్ని ఫోర్జరీ చేసి 1991 సంవత్సరానికి చెందిన పాత స్టాంపు పేపరుపై అన్ రిజిస్టర్డ్ నోటరీ తయారు చేసి స్థలం కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్ సృష్టించాడు. నిందితులు రాము, మాధవిలు ఆన్‌లైన్‌లో కొత్త ఇంటి నంబర్ పొంది, ఆ పత్రాల ఆధారంగా ఆజంపురా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చట్ట విరుద్ధంగా గిఫ్ట్ డీడ్ రిజిస్టర్ చేయించుకున్నట్లు ఆధారాలు సేకరించి అజంపురా సబ్ రిజిస్ట్రార్‌తో పాటు బి. రాము, బి. మాధవి, తాటిపల్లి శ్రీనివాస్, టి.రజిత, పాత స్టాంపు పేపరు విక్రయించిన షేక్ కమాలుద్దీన్‌లపై మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులపై చీటింగ్, ఫోర్జరీ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న బి.మాధవిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది.